క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

మద్దూరు: మండల సర్వసభ్యసమావేశం గురువారం మధ్యాహ్నం 2గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని సూచించారు. మూడునెలల ప్రగతి నివేదికలను అన్నిశాఖల అధికారులు తమవెంట తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



మాగనూర్: మండలంలోని బైరంపల్లి సమీపంలో సర్వే నంబర్ 71, 72లో ప్రభుత్వ భూమిని రికార్డు నుంచి తొలగించి గ్రామ పంచాయతీకి అప్పగించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు గ్రామస్తులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో సర్వేనంబర్ భూమిని అధికారులు సర్వేచేసి పంచాయతీ నూతన భవనం నిర్మాణంకోసం కేటాయించారని, అయితే ఇప్పటికే నిర్మాణం కూడా పూర్తయిందని తెలిపారు. ఈ విషయంపై స్పందించి భూమి వారి పేరుమీద నుంచి రికార్డులో తొలగించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాయచూర్‌కు అదనపు రైలు నడిపించాలి

మరికల్: కృష్ణా వంతెన మరమ్మతుల కారణంగా హైదరాబాద్‌నుంచి రాయచూర్‌కు అదనపు రైళ్లను నడిపించాలని రాష్ట్ర బీజేపీ నాయకులు నర్సన్‌గౌడ్, వేణు, భాస్కర్‌రెడ్డి కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా వంతెన మరమ్మతుపనులు 45రోజుల పాటు జరగనుండటంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మక్తల్, కృష్ణా మీదుగా అదనపు రైళ్లు నడిపిస్తే రాకపోకలకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ విషయంపై రైల్వేశాఖ అధికారులు స్పందించి రోజుకు ఐదుచొప్పున ప్యాసింజర్ రైళ్లను నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరక ఎడ్లబండ్ల పోటీలు



మరికల్: సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని మండల వికాస వేదిక ఆధ్వర్యంలో బుధవారం రైతులకు ఎడ్లబండ్ల గిరక పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, సర్పంచ్ గోవర్ధన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి విజేత ఎలిగండ్లఎండ్ల బండికి 8తులాల వెండి, రెండో విజేత మరికల్ ఎడ్ల బండికి 5తులాలు, మూడో విజేత మరికల్‌కు 3తులాల వెండిని బహుమతిగా అందజేశారు. వికాస అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, గోపాల్, శ్రీను, రాములు, హన్మిరెడ్డి పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు



మరికల్: కృష్ణా బ్రిడ్జి మరమ్మతులతో మరికల్ విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద రాయిచూర్ వెళ్లే వాహనాలను గద్వాల్ మీదుగా మళ్లించేందుకు బుధవారం పోలీసులు చర్యలు చేపట్టారు. టైరోడ్డు వరకే వెళ్లే వాహనలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. రాయిచూర్ వెళ్లే వాహనాలు మాత్రం గద్వాల్‌మీదుగా పంపిస్తున్నారు. ఇందుకు సబ్‌స్టేషన్ చౌరస్తావద్ద రాయిచూర్ వెళ్లే వాహనలకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ఘనంగా మైసమ్మ ఉత్సవాలు



మద్దూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో శివారులో బులెమోని మైసమ్మ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. చెన్నారెడ్డిపల్లి, మోమినాపూర్, పెదిరిపాడ్, రెనివట్ల తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఓపెన్‌టూఆల్ కబడ్డీపోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు మద్దూరు, దామరగిద్ద, నారాయణపేట మండలాలకు చెందిన 30టీంలు పాల్గొన్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూర్: మండలంలోని సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు సహకారంతో పాటు కృషిఎంతో అవసరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఎంపీడీఓ సమావేశంలో ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షత నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. ఎప్పుడు ఒకే సమస్యపై సభలో చర్చ ఉండొద్దని ఎప్పటి సమస్య అప్పుడు పరిష్కరించుకోవాలని సభ్యులకు సూచించారు. సమస్యలు ఉంటే తనకు నేరుగా సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. సంగంబండ లోలెవల్ కాల్వ బండరాయి ద్వారా మండలంలోని పలు గ్రామాలకు సాగునీరందక ఇబ్బందులు పడుతున్న రైతులకు అతిత్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. రైతులు సబ్సిడీ పరికరాలను అందించాలని కోరుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై అందించాలని రైతులు కోరుతున్నారన్నారు. రైతులు వరిసాగు వేసి నెలరోజులు గడుస్తున్నా నేటి వరకు ఒక్క వ్యవసాయ అధికారి పంటలను పరిశీలించలేదని, చాలా వరకు పంటలు ఎండిపోయాయని వైస్‌ఎంపీపీ తిప్పయ్య అన్నారు. ఈ విషయంపై అధికారులకు తెలియజేసి సమస్యపరిష్కరిస్తామని ఏఓ సుదర్శన్‌గౌడ్ పేర్కొన్నారు. ఎంపీడీఓ శశికళ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలు పనులు చేపడుతున్నారని, ఆ పనుల ప్రగతి విషయం తెలియడం లేదని ఎంపీడీఓ సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో రేషన్‌బియ్యం సరఫరా చేయడం లేదని ఓబ్లాపూర్ గ్రామ సర్పంచ్ నారాయణ అడగగా, తహసీల్దార్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో పీడీఎస్ బియ్యం ఒక్కదారి పట్టాయని తెలిపారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. మండలంలో జరిగే ప్రభుత్వ పనులపై సమాచారమందించడం లేదని ఎంపీపీ శ్యామలమ్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉజ్జెల్లి గ్రామం డబ్బులు చెల్లించాలని గ్రామసర్పంచ్ లక్ష్మమ్మ ఎమ్మెల్యేతో అన్నారు. త్వరలోనే డబ్బులు చెల్లించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు. వైద్యాఆరోగ్య శాఖలో సమస్యలపై ఎమ్మెల్యే ఆరాతీశారు. దీంతో డాక్టర్ విరోజ మాట్లాడుతూ.. ప్రధానంగా మందుల కొరత ఉందని తెలిపారు. మండలంలో అవసరమైన మేర విద్యుత్‌సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ ఏఈకి ఎమ్మెల్యే సూచించారు. బైరంపల్లిలో విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామసర్పంచ్‌మంజుల ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని విద్యుత్ ఏఈ దేవేంద్రనాయుడు తెలిపారు. మాగనూర్ నుంచి వర్కూర్ మీదుగా నేరడగం వరకురోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, రోడ్డుకుఇరువైపుల కంపచెట్లు కొట్టించాలని వైస్‌ఎంపీపీ తిప్పయ్య కోరారు. పంచాయతీ రాజ్ ఏఈ విలోక్ మాట్లాడుతూ.. ఇప్పటికే రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైందని, ఓవర్‌లోడ్ వాహనాలు తిరగడంతోరోడ్డు మరమ్మతుల వ్యయంపెంచాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ఆయాశాఖల అధికారులు ప్రగతి నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీశ్యామలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, వైస్‌ఎంపీపీ దూళ తిప్పయ్య, కో–ఆప్షన్ మెంబర్ యాకుబ్‌ఆలీ, ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీఓ జైపాల్‌రెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కోస్గి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి గ్రామాలు అన్నిరంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేలా కృషిచేయాలని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం ఎంపీపీ మధుకర్‌రావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులకొరత లేదని, ప్రజాప్రతినిధులు, అధికారులు కావాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళికలు పంపిస్తే పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ భూములు గుర్తించాలని, గ్రామాల్లో అవసరమైన పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఇతర అవసరమైన భవనాల నిర్మాణంతోపాటు మరమ్మతులకోసం నిధులు అవసరమైతే నివేదికలు ఇవ్వాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి హాజరు కాకుండా నివేదికలు ఇవ్వని విద్యాశాఖ, ఇరిగేషన్ శాఖ, ఉద్యానవన శాఖలపై ప్రత్యేకాధికారి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయా శాఖల అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి నివేదిక చదువుతుండగా చంద్రవంచ సర్పంచ్ రఘువర్ధన్‌రెడ్డి తమ గ్రామంలో ఉన్న పశువైద్యశాలలో విధులు నిర్వహించే అటెండర్‌ను డిప్యూటేషన్ వేయడంతో పశువైద్యం అందడం లేదని ఫిర్యాదు చేశారు. అప్పటికప్పుడు ఉన్నతాధికారులతో మాట్లాడి డిప్యూటేషన్ రద్దు చేశారు. సర్జఖాన్‌పేట సర్పంచ్ హరీష్‌గౌడ్ వ్యవసాయ శాఖకు సంబంధించి గ్రామాల్లో ఏఈఓలు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు చేయగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి ఆదేశించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమతమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాయిలు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కాళప్ప, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీ ఫైనల్‌లో పాల్గొన్న ఇరు జట్లు

నారాయణపేట రూరల్ : మండలంలోని శ్యాసన్‌పల్లిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మన ఊరు – మన ఆటలు కార్యక్రమంలో భాగంగా గ్రామ యువత ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తుంచారు. ఈ క్రమంలో హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్ జరుగగా క్రాంతి ఫ్రెండ్స్‌పై గౌరీ ఫ్రెండ్స్ విజయం సాధించింది. అత్యధిక పరుగులు సాధించిన రాజు, ఎక్కువ వికెట్లు తీసిన భగవంతుకు మెమొంటోలను అందజేశారు. అనంతరం విజేత, రన్నర్‌గా నిలిచిన ఇరువురికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆటల్లో భాగస్వామ్యం కావాలని, శారీరక దృఢత్వ, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, యువజన సభ్యులు నరేష్, ఆనంద్, నర్సింహ, శివ, ప్రవీణ్, భార్గవ్, రఫీక్, విష్ణు, శంకర్, హరీష్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడ కబడ్డీని ప్రోత్సహిద్దాం

నర్వ: గ్రామీణ క్రీడ కబడ్డీని ఔత్సాహికులమంతా ప్రోత్సహించాలని బీఆర్‌ఎస్ నాయకులు దండు అయ్యప్ప అన్నారు. బుధవారం బెక్కర్‌పల్లిలో ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని రెండు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఫైనల్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠంగా కొనసాగింది. ఇందులో మూలమల్ల జట్టు ప్రథమ విజేతగా నిలువగా, రన్నర్ జట్టుగా నాగల్‌కద్మూర్ జట్టులు నిలిచాయి. అనంతరం ప్రథమ విజేత జట్టుకు దాత దండు అయ్యప్ప రూ.20వేలు, ద్వితీయ విజేతకు రూ.15వేలు అందజేశారు. సర్పంచ్ నాయకులు రవి, గడ్డం నర్సింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

మాగనూర్: కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కనకరాజ్ కోరారు. బుధవారం మండలంలోని ఉజ్జెల్లిలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని వివరించారు. పేదలకోసం కనీసమౌళిక సదుపాయాల కల్పన, అణగారిన వర్గాలకు సామాజిక భద్రత, ఆయుష్మాన్‌భారత్, సాధికారతపై మహిళలకు భరోసా, రైతు సంక్షేమానికి భరోసా, భారత్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ సుమన్, ఉపసర్పంచ్ స్వప్న, బూత్ అధ్యక్షుడు అంజప్ప, శ్రీను, రఘు, నర్సింహులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు అవకాశం

కోస్గి: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ ఇంటి పన్ను చెల్లింపుకోసం ఇంటి యజమాని పేరు, తండ్రిపేరు, ఇంటి నంబర్, ఇంటి కొలతలకు సంబంధించి ఎలాంటి తప్పులు ఉన్న సవరణ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తప్పుల సవరణ నిర్వహిస్తున్నామని, అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాగనూర్: మధ్యాహ్నభోజన కార్మికుల వేతనలు విడుదల చేయాలని కోరుతూ.. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు.. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ.. గత 9నెలలుగా కార్మికులకు ప్రభుత్వం నుంచి వేతనాలు అందడం లేదన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ హెల్త్‌కార్డులు, ఏకరూప దుస్తులు, ప్రమాద భీమా, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

కోస్గి: 18 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే బాలకార్మిక చట్టాల కింద యజమానులపై కేసులు నమోదుచేస్తామని సీఐ జనార్దన్ గౌడ్ సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని ఇటుక బట్టీల యజమానులకు, కార్మికులకు అవగాహన నిర్వహించారు. చదువుకునే వయస్సులో పిల్లలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని బట్టీల యజమానులు గుర్తించుకోవాలన్నారు. ఇటుక బట్టీలలో పనిచేసేందుకు వచ్చిన కార్మికులకు చదువుకునే వయస్సు ఉంటే సమీప పాఠశాలలో చేర్పించాలన్నారు. బట్టీల వద్ద మాదక ద్రవ్యాలు దొరికిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై శ్రీనివాసులు, బట్టీల యజమానులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలు పూర్తి చేయండి

కోయిల్‌కొండ: మండలంలో చేపడుతున్న పంచాయతీ భవన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాములు ఆదేశించారు. బుధవారం మండలంలోని కనాయపల్లిలో పంచాయతీ భవన పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించారు. మొక్కలను ఇచ్చిన గడువులోగా సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు.

పెద్దపొర్లలో గ్రామసభ బహిష్కరణ

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో బుధవారం నిర్వహించిన గ్రామసభను గ్రామస్తులు బహిష్కరించారు. గ్రామ కార్యదర్శి సుజాత సమక్షంలో గ్రామసభను ప్రారంభించారు. గ్రామంలో కనీస వసతులు లేవని పారిశుధ్య పనులు చేపట్టడం లేదని, విద్యుత్ సక్రమంగా సరఫరా కావడం లేదంటూ గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దళితవాడలో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని, రోడ్లు గుంతలమయాంగా ఏర్పడిందని కాలనీవాసులు ఆరోపించారు. ఉన్నతాధికారులు వచ్చేవరకు గ్రామసభను నిర్వహించేదిలేదని గ్రామస్తులు బహిష్కరించారు. దీంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్, కనకరాయుడు, ఎమ్మార్పీఎస్ హన్మంతు, బాబు పాల్గొన్నారు.

కేరళకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



నారాయణపేట: కేరళ రాష్ట్రంలో కాలికట్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఎంవీఆర్ క్యాన్సర్ సెంటర్, పరిశోధన సంస్థ ఏడో వార్షికోత్సవంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిబారిన పడిన నిరుపేదలకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తున్న ఎంవీఆర్ క్యాన్సర్, రిసర్చ్ ఇనిస్టిట్యూట్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను నిర్వాహకులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎమ్మెల్యేతోపాటు భర్త డాక్టర్ విశ్వజిత్‌రెడ్డి ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ రవి నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు వ్యవసాయశాఖ అమలు చేసే పథకాలను రైతులకు చేరేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ యశ్వంత్‌రావు, అధ్యక్షుడు రాంపాల్, రాజేందర్‌రెడ్డి, ప్రత్యూష, కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మహిళలకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్

- గోప్యంగా ఫిర్యాదుదారుల వివరాలు



ఫిర్యాదు స్వీకరిస్తున్న మహిళా పోలీస్ కానిస్టేబుల్ రేఖశ్రీ

మాగనూర్: మహిళల సమస్యలు తెలుసుకుని వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా మహిళ హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు. ప్రతి డెస్క్‌లో మహిళ పోలీస్ సిబ్బంది ఉండేలా వీటిని రూపకల్పన చేశారు. దీంతో మహిళలు అన్ని సమస్యలను చెప్పుకునేందుకు ఆస్కారం ఉంటుంది.

హెల్ప్‌డెస్క్‌లో మహిళ సిబ్బంది..

మహిళలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలు చెప్పుకునేందుకు జంకుతున్న వేళ ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికురులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రతి పోలిస్టేషన్‌లో ఉమెన్స్‌హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అక్కడ మహిళా పోలీసులే ఉండేలా రూపకల్పన చేశారు. ఒక్కో డెస్క్‌కు ఇద్దరు మహిళ పోలీసులను కేటాయించారు. వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. తమ సమస్యలను చెప్పుకునేందుకు స్టేషన్‌కు వచ్చే వారితో ఎలా వ్యవహరించాలి, వారిలో భయం పోగొట్టి సమస్యను ఎలా తెలుసకోవాలనే దానిపై శిక్షణ ఇచ్చారు.

ఫిర్యాదుదారుల వివరాలు..

మహిళలు తమ సమస్యలను నిర్భయంగా చెప్పి న్యాయ సహాయం, కౌన్సిలింగ్, ఆశ్రయం, పునరవాసం సులభతరం చేయడానికి జిల్లాలోని అన్నిపోలీస్టేషన్లలో ఉమెన్స్‌లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు. స్టేషన్‌లోని ఓ ప్రత్యేక ప్రదేశంలో వీటిని ఏర్పాటు చేశారు. వారికి ఓ భరోసా ఈ హెల్ప్‌డెస్క్ వద్ద లభిస్తుందని పోలీసులు చెబుతున్నారు. మహిళలు, యువతులు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా ఈవ్‌టీజింగ్, వేధింపులు, బయటకు చెప్పుకోలేని సమస్యలను ఇక్కడ పరిష్కరించుకోవచ్చు.

నిర్భయంగా వచ్చి ఫిర్యాదు చేయాలి..



సమస్యలు ఉన్న మహిళలు మరింత స్వేచ్ఛగా, నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చేలా చేయడమే ఉమెన్స్‌హెల్ప్‌డెస్క్ ఉద్దేశం. మగ పోలీసులకు చెప్పుకోలేని సమస్యలను ఇక్కడి మహిళా సిబ్బందికి చెప్పి పరిష్కారం పొందొచ్చు. పోలీసులంటే అపోహలు పోగొట్టి మహిళలపై సున్నితంగా ఉండటానికి, స్నేహపూర్వకంగా ఎలా వ్యవహరించాలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కల్పించాం.

– మల్లేష్, ఎస్‌ఐ మాగనూర్

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించి ఒకరిపై కేసు నమోదు చేశారు. అలాగే వాహనదారుల హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. 12 బైకులకు జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని వాహనదారులకు సూచించారు.

ప్రభాకర్‌రావు సేవలు మరువలేనివి



నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రిటైర్డ్ తహసీల్దార్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రావు సేవలు మరువలేనివని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు స్వామి అన్నారు. ప్రభాకర్‌రావు దశదిన కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్‌గా ప్రజలకు సేవలు చేశారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం పాటు పడతామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మురళీ, జిల్లా అధ్యక్షుడు అనంతరాములు, ప్రతాప్, శంకర్‌దాసు, వెంకటేశ్, బుచ్చన్న, శ్రీకాంత్, నీలికిశోర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గాయత్రి మహా మంత్రజపం



జపం చేస్తున్న ఐక్యవేదిక సభ్యులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సకల మానవాళి శ్రేయస్సు కోసం స్థానిక కాటన్‌మిల్లు ఆవరణలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం సామూహిక గాయత్రి మహామంత్ర జప యజ్ఞం చేశారు. పాలమూరు బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కల్వకొలను చిత్తరంజన్ దాస్ స్మారకసేవా సమితి ప్రతినిధులు కందిబండ ప్రసాదరావు, పరాయతనం శరత్ కృష్ణ, ఓలేటిమరిడి రాజు, మహేశ్వరావు, ఫణిప్రసాద్, వెంకటసాయి, కందిబండ పద్మ, ఓలేటి పద్మ, ఐక్యవేదిక సభ్యులు గౌంద్యాల రాఘవేంద్రశర్మ, తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, వేముల మనోహర్‌రావు కొవ్వూరు భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల ఏర్పాటుకు వినతి

కోస్గి: మండల పరిధిలో విద్యాభివృద్ధికి సంబంధించిన వసతులను ఏర్పాటుచేయాలని కోరుతూ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి బుధవారం విద్యావంతుల వేదిక తరుపున వినతిపత్రం అందజేశారు. విద్యాపరంగా వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి ద్వారా ముఖ్యమంత్రికి లేఖ అందజేశారు.

బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలి

మాగనూర్: మండల కేంద్రంలోని బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని ఉద్యోగస్తులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని బుధవారం మండల సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి పలువురు మహిళలు వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బస్‌స్టాప్ ఏర్పాటు చేస్తామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.